# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 7-1-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:122 పేజీలు:6 వెల: రూ.1/-


**చురక**

ప్రతిపక్షం పాత్రలో
పాత పవర్ నేతలు
జీర్ణించుక తప్పదిక
జనం తీర్పు రాతలు.

ప్రభుత్వాన్ని నిగ్గదీసె
ప్రజలతరపు కొత్తగొంతు
ప్రతిభతోని వినిపిస్తూ
పాసవుదే ఇక వంతు

-వేల్పుల నారాయణ
9440433475

## ఈ నెల 13 నుంచి వరకు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలకు సెలవులు

హైదరాబాద్ జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణలో ఇంటర్ విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ప్రకటించింది. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలకు సెలవులు ఇచ్చారు. సెలవుల సమయంలో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.తెలంగాణలోని జూనియర్ కాలేజీ విద్యార్థులకు సంక్రాంతి సెలవులను ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సెలవులు ఇచ్చింది. తిరిగి 17వ తేదీన కళాశాలలు ప్రారంభమవుతాయని తెలిపింది.

## సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వైఎస్ షర్మిల



హైదరాబాద్, జనవరి 6: సీఎం రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ నేత వైఎస్ షర్మిల కలిశారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో శనివారం రేవంత్ రెడ్డిని షర్మిల కలిశారు.

తన కుమారుడు వైఎస్ రాజారెడ్డి పెళ్లికి రావాలని ఆహ్వానించారు. ఈ మేరకు పెండ్లి పత్రికను రేవంత్ రెడ్డికి అందించారు.

వైఎస్ షర్మిల కుమారుడు వైఎస్ రాజారెడ్డితో ఈ నెల 18న అట్లూరి ప్రియ నిశ్చితార్థం జరగనుంది. ఫిబ్రవరి 17వ తేదీన వివాహం జరగనుంది. ఈ నేపథ్యంలో ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద షర్మిల తొలి ఆహ్వాన పత్రికను ఉంచి.. వైఎస్సార్ ఆశీస్సులు తీసుకున్నారు..

ఆ తర్వాత ఏపీ సీఎం జగన్‌ను కలిసి పెళ్లికి ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డిని వైఎస్ షర్మిల కలిశారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి రేవంత్‌ను కలుసుకున్నారు. తన కుమారుడు వైఎస్ రాజారెడ్డి పెళ్లికి రావాలని ఆహ్వానించారు.

## అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందింది: ఖర్గే

న్యూఢిల్లీ జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): అయోధ్యలో రామాలయాన్ని ఈనెల 22వ తేదీన ఓపెన్ చేయనున్న విషయం తెలిసిందే. ఆ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఆహ్వానం అందిందని, త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లిఖార్జున్ ఖర్గే తెలిపారు. ఈడీ, ఐటీ లాంటి శాఖలను బీజేపీ దుర్వినియోగం చేస్తోందన్నారు. భారత్ జోడో న్యాయ యాత్రలో పాల్గొనేందుకు పౌరహక్కుల నేతల్ని ఆహ్వానించినట్లు ఖర్గే వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త కార్మిక చట్టాలను ఆయన వ్యతిరేకించారు. నియంతృత్వ సంకేతాలన్నారు. మణిపూర్‌లో చాలా దురదృష్టకర సంఘటనలు జరిగాయని, కానీ ఫోటో షూట్ల కోసం మోదీ బీచ్‌లకు వెళ్లారు కానీ మణిపూర్‌కు ఎందుకు వెళ్లలేదన్నారు. భారత్ జోడో న్యాయ యాత్రకు చెందిన లోగోను, నినాదాన్ని ఆయన ఆవిష్కరించారు.

## పారిశ్రామిక వృద్ధికి మెగా మాస్టర్ పాలసీ : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 6: 2050 నాటికి తెలంగాణ అంతటా పారిశ్రామిక వృద్ధి జరగాలనే భవిష్యత్తు లక్ష్యంతో మెగా మాస్టర్ పాలసీ రూపకల్పన చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సెక్రటేరియల్‌లో భారత పారిశ్రామిక సమాఖ్య (సీఐఐ) ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణ ప్రాంతంలో 1994 నుంచి 2004 వరకు పరిశ్రమల అభివృద్ధికి అనుసరించిన ఫార్ములా ఒక తీరుగా ఉంటే.. 2004 నుంచి 2014 వరకు అది మరో మెట్టుకు చేరుకుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇది అత్యున్నత వృద్ధి దశకు చేరుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

పరిశ్రమల అభివృద్ధికి.. పెట్టుబడులను ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఫ్రెండీ పాలసీని అనుసరిస్తుందని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధి విషయంలో అపోహలు, అనుమానాలకు తావు లేదని అన్నారు. పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టే ప్రతి పైసా పెట్టుబడికి రక్షణ కల్పిస్తామని, అంతకంతకు విలువ కూడా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రజల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తుందనే ఆలోచనలకు భిన్నంగా కొత్త పాలసీని ప్రభుత్వం అనుసరిస్తుందని స్పష్టం చేశారు.

హైదరాబాద్ ఒక్కచోటే పారిశ్రామిక అభివృద్ధి కేంద్రీకృతం కాకుండా.. తెలంగాణలోని అన్ని ప్రాంతాలు హైదరాబాద్ తరహాలోనే అభివృద్ధి చెందాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలకు పరిశ్రమలు విస్తరించాలనేది తమ లక్ష్యమని తెలిపారు. నగరాలు, పట్టణాల్లో అభివృద్ధి ఫలాలు, పెట్టుబడులతోనే గ్రామాలు, గ్రామీణ ప్రాంతాల సౌభాగ్యం, సంక్షేమం ముడిపడి ఉంటుందని అన్నారు. పారిశ్రామికంగా అన్ని రంగాలు అభివృద్ధి చెందేలా ఫ్రెండ్లీ పాలసీని అమలు చేసేందుకు ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు.

ఈ పాలసీలో భాగంగా తెలంగాణను మూడు క్లస్టర్లుగా విభజించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు లోపల అర్బన్ క్లస్టర్, ఓఆర్ఆర్ తర్వాత రీజనల్ రింగ్ రోడ్డు వరకు మధ్యలో ఉన్న ప్రాంతం సెమీ అర్బన్ క్లస్టర్‌గా, రీజనల్ రింగ్ రోడ్డు తర్వాత చుట్టూరా ఉన్న ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్‌గా గుర్తించి పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఫార్మాసిటీ విషయంలో ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయని తెలిపారు.

ఫార్మాసిటీగా కాకుండా ఫార్మా విలేజీలను అభివృద్ధి చేస్తామన్నారు. ఓఆర్ఆర్‌పై 14 రేడియల్ రోడ్లు ఉన్నాయని, వీటికి 12 జాతీయ రహదారుల కనెక్టివిటీ ఉందని.. వీటికి అందుబాటులో ఉండేలా దాదాపు వెయ్యి నుంచి 3వేల ఎకరాలకో ఫార్మా విలేజీని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజల జీవనానికి ఇబ్బంది లేకుండా కాలుష్యం లేకుండా, పరిశ్రమలతో పాటు స్కూల్స్, హాస్పిటల్స్, అన్ని మౌలిక సదుపాయాలుండేలా వీటిని అభివృద్ధి చేసే ప్రణాళికలను ప్రభుత్వం రూపొందిస్తుందని అన్నారు.

జహీరాబాద్‌లో ఐటీ, ఫార్మా, హెల్త్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, స్పోర్ట్స్, ఆటోమొబైల్, ఆర్గానిక్ క్లస్టర్లుగా అక్కడ పరిశ్రమల ఏర్పాటు జరగాలని అన్నారు. రక్షణ రంగం, నావికా రంగానికి అవసరమైన పరికరాల తయారీ, ఉత్పత్తికి హైదరాబాద్‌లో అపారమైన అవకాశాలున్నాయని, పారిశ్రామికవేత్తలు వీటిపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. కొత్తగా సోలార్ పవర్ పాలసీని రూపొందిస్తామని, సోలార్ ఎనర్జీ పరిశ్రమలకు తగిన ప్రోత్సాహకాలు అందిసామన్నారు. ఎన్నికలు, రాజకీయాలు వేరు.. అభివృద్ధి వేరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

దార్శనికతతో పారదర్శకమైన అభివృద్ధి తమ లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమల వృద్ధికి సహకరించదని, అపోహాలు అవసరం లేదని, ఎవరికి వారుగా తమకున్న అభిప్రాయాలు ఇతరులపై రుద్దవద్దని హితవు పలికారు. 24 గంటల పాటు తాను ఆఫీసు, క్యాంపు కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉంటానని, తనతో మాట్లాడి నిర్ణయాలు తీసుకోవాలని పారిశ్రామికవేత్తలను, పెట్టుబడిదారులను ఆహ్వానించారు. తమతోనూ, ప్రభుత్వ ప్రతినిధులు అయిన అధికారులతో మాట్లాడకుండానే తొందరపడి ఒక అభిప్రాయానికో, నిర్ణయానికో రావద్దని అన్నారు.

రాష్ట్రంలో సుమారు 35 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, వీరిని తాము భారంగా భావించడం లేదని అన్నారు. వీరందరినీ పరిశ్రమల అభివృద్ధిలో పాలుపంచుకునే మానవ వనరులుగా భావిస్తున్నామని తెలిపారు. యువతీ యువకులకు స్కిల్స్ నేర్పించేందుకు స్కిల్ యూనివర్సిటీలను నెలకొల్పుతామని అన్నారు. స్కిల్ యూనివర్సిటీల్లో డిగ్రీలు పొందిన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని, పోటీ ప్రపంచంలో ఎక్కడైనా నిలదొక్కుకునే సామర్థ్యం వాళ్ల సొంతమవుతుందన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రి, ఐటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత బదిలీ

**– కొత్త కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి అభిలాష అభినవ్**



హైదరాబాద్ జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు, జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమతను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మమతను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా నియమించారు. ఇక కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి అభిలాష అభినవ్ నియామకమయ్యారు.జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సైతం బదిలీ అయ్యారు. జీహెచ్ఎంసీలో శ్రీనివాస్‌రెడ్డి డెప్యూటేషన్‌ను రద్దు చేసింది. చేనేత, జౌళిశాఖ అదనపు డైరెక్టర్‌గా పాతచోటుకే చోటుకే ప్రభుత్వం బదిలీ చేసింది. ఇక శేరిలింగంపల్లి కొత్త జోనల్ కమిషనర్‌గా ఐఏఎస్ స్నేహ శబరీష్ నియామకమయ్యారు. జీహెచ్ఎంసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ వెంకట రమణను మూసీ నది అభివృద్ధి సంస్థ ఎస్‌ఈగా బదిలీపై పంపింది. ప్రస్తుతం మూసీ అభివృద్ధి సంస్థ ఎస్ఈ మల్లికార్జునుడును ఈఎన్‌సీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

## ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్టు

హైదరాబాద్ జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను హైదరాబాద్ సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. పెట్టుబడులు, ఆన్‌లైన్ గేమ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్లుగా గుర్తించి.. వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కోటికి పైగా నగదు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సైబర్ క్రైమ్ విభాగం రెండు కీలకమైన కేసులను చేధించిందని హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. డఫాబెట్ వెబ్‌సైట్‌లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని చెప్పి నిందితులు మోసాలు చేస్తున్నారని తెలిపారు. ఓ వ్యక్తి డఫాబెట్‌లో రూ. 70లక్షలు పెట్టి ఆన్‌లైన్ గేమ్ ఆడారని.. ఆ తర్వాత మోసపోయానని గ్రహించి ఫిర్యాదు చేశారని అన్నారు. హైదరాబాద్‌కు చెందిన సదరు వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. హరియాణాకు చెందిన హితేశ్ గోయల్ మోసాల్ చేశాడని.. నిందితుణ్ని ఢిల్లీలో అరెస్టు చేశామని తెలిపారు . నిందితుడి నుంచి రూ.1.40 కోట్ల నగదు సీజ్ చేశామని తెలిపారు.యూనిటీ స్టాక్స్ పేరుతో ఆన్‌లైన్ మోసాలు చేస్తున్న మరో వ్యక్తిని కూడా అరెస్టు చేశామని హైదరాబాద్ సీపీ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బాధితురాలు రూ3.16 కోట్లు నష్టపోయానని ఫిర్యాదు ఇచ్చిందని అన్నారు. నిందితుడు రోనక్ తన్నాను అరెస్టు చేశారని తెలిపారు. రోనక్ తన్నా దుబాయ్ నుంచి మోసాలకు పాల్పడేవాడని చెప్పారు. నిందితుల బ్యాంక్ ఖాతాలోని రూ.20 లక్షలు ఫ్రీజ్ చేశామన్నారు. నిందితుడికి సహకరించిన మరో ఇద్దరికి నోటీసులు జారీ చేశారని అన్నారు. నిందితుడు 95 బ్యాంకు ఖాతాలు వాడుతున్నట్లు గుర్తించామని తెలిపారు.

## రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మరి కొన్ని నూతన బొగ్గు బ్లాకులకు ప్రణాళిక

**-సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్**




హైదరాబాద్ జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఈ ఏడాది సింగరేణిలో ప్రారంభించే 4 కొత్త గనులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారం తో మరి కొన్ని నూతన బొగ్గు బ్లాకుల సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్నామని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ లో సింగరేణిలో కొత్త గనులపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన పలు అంశాలపై లోతుగా చర్చించారు. నూతన గనులపై తగిన కార్యాచరణతో ముందుకెళ్లాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్ని ఏరియాల జీఎంలను ఆదేశించారు.ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించాల్సిన నాలుగు కొత్తగనుల ప్రణాళికలు, పనుల పై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ఒడిషా రాష్ట్రంలో సింగరేణి చేపట్టిన నైనీ బొగ్గు బ్లాకు ప్రస్తుత పరిస్థితి పై చర్చించిన ఆయన, చివరి దశ అనుమతులకు అక్కడి రాష్ట్ర ప్రభుత్వసహకారం కావాల్సి ఉందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకొని ఒడిశా ముఖ్యమంత్రితో చర్చించేందుకు ఈ నెల మూడో వారం భువనేశ్వర్ వెళున్నారని.. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీనితో ఈ బ్లాకు సంబంధించిన చివరి అనుమతులు పూర్తయి అతి త్వరలోనే ఇక్కడ నుండి బొగ్గు ఉత్పత్తి ప్రారంభం అవుతుందని ఆయన ఆశాభావం ప్రకటించారు.నైనీ బొగ్గు బ్లాక్ నుండి ఏడాదికి కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుందని, అయితే తొలి ఏడాది 60 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నైనీ బొగ్గు బ్లాక్ నుండి బొగ్గును సమీపంలోని రైల్వే సైడింగ్ కు తరలించడానికి కాంట్రాక్ట్ కూడా అప్పగించడం జరిగిందన్నారు. అలాగే కొత్తగూడెం ఏరియాలో ప్రారంభించాల్సి ఉన్న వీకే ఓపెన్ కాస్ట్ గనికి సంబంధించి మిగిలిన అనుమతులు పూర్తిచేసుకుని ఈ ఏడాది కనీసం 30 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసేందుకు సన్నద్ధం కావాలని ఆయన సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ గని నుండి ఏడాదికి 43 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియజేశారు.అలాగే ఇల్లెందు ఏరియాలో ఏడాదికి 20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ప్రారంభించనున్న రొంపెడు ఓపెన్ కాస్ట్ గని నుండి ఈ ఏడాది కనీసం 10 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని, దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. బెల్లంపల్లి ఏరియాలో ప్రారంభించాల్సి ఉన్న గోలేటి ఓపెన్ కాస్ట్ గని అనుమతులు, తదితర అంశాల పైన సంబంధిత అధికారులతో చర్చించారు . ఏడాదికి 35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ఈ గని నుండి ఈ ఏడాది కనీసం 4 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని ఆదేశించారు. అనుమతుల విషయంలో కాలయాపన జరిగితే రేట్లు పెరిగి ఉత్పత్తి వ్యయం భారీగా పెరుగుతుంది కనుక ఏరియాల జీఎంలు స్థానిక జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులతో సంప్రదిస్తూ అనుమతులు త్వరగా పొందాలని ఆదేశించారు. వచ్చే ఏడాది ప్రారంభించాల్సి ఉన్న రామగుండం ఓపెన్ కాస్ట్ గని, ఎంవీకే ఓపెన్ కాస్ట్ గనుల గురించి కూడా ఛైర్మన్ చర్చించారు. ఇవే కాకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా మరికొన్ని బొగ్గు బ్లాక్ లను పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రయత్నాలు ప్రారంభించనున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి బట్టి విక్రమార్క ఇటీవల సింగరేణి పై నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో కొత్త గనుల ప్రారంభానికి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారని గుర్తుచేశారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు (ఈ అండ్ ఎం),ఎన్.వి.కె.శ్రీనివాస్ (ఆపరేషన్స్), జి.వెంకటేశ్వరరెడ్డి (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) జె.అల్విన్, జీఎం (కో ఆర్డినేషన్) ఎం.సురేశ్, జీఎం (సీపీపీ) జక్కం రమేశ్, జీఎం (ఎంపీ) మల్లెలజీఎం సుబ్బారావు, జీఎం (ఎస్టేట్స్) సురేశ్, జీఎం (మార్కెటింగ్) జి.దేవేందర్, జీఎం (సివిల్) సూర్యనారాయణ, కార్పోరేట్ జీఎంలు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలను ఆచరణలోకి తీసుకొస్తాం : మంత్రి దామోదర రాజనర్సింహ




మెదక్, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణలో ఆరు గ్యారెంటీలను తప్పకుండా ఆచరణ లోకి తీసుకొస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శనివారం మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజాపాలన లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రూ 10 లక్షలతో ఆరోగ్య శ్రీ పథకం అమలు చేస్తోందని , ఇప్పటికే మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించిందని గుర్తు చేశారు.ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలాలు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు అందజేస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక విజన్ ఉందని పేర్కొన్నారు. గత కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ పాలనను ప్రజలకు అందించామని వివరించారు. రాజకీయం శాశ్వతం కాదని వ్యవస్థ ముఖ్యమని అన్నారు. తాను విద్యా శాఖ మంత్రిగా ఉన్న కాలంలో మోడల్ స్కూల్స్, కేజీబీవీలను ఏర్పాటు చేశామని తెలిపారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి షాక్ ఇచ్చిన సీనియర్ అడ్వకేట్

న్యూఢిల్లీ జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు షాక్ ఇచ్చారు సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గీ. రెండు లిక్కర్ కంపెనీల మధ్య ఏర్పడిన వివాదం కేసులో విచారణ జరుగుతున్న సమయంలో ఆయన రెండు విస్కీ బాటిళ్లను తెచ్చి సీజేఐ చైర్ ముందు పెట్టారు.

మధ్యప్రదేశ్‌కు చెందిన పెర్నాడ్ రికార్డ్ కంపెనీ దావా చేసిన కేసులో సీజేఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. లండన్ ప్రైడ్ పేరుతో ఇండోర్‌కు చెందిన జేకే ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ మద్యం ఉత్పత్తి చేస్తోందని, ఆ కంపెనీని అడ్డుకోవాలని పెర్నాడ్ రికార్డ్ కంపెనీ సుప్రీంలో పిటీషన్ వేసింది. ఈ నేపథ్యం లో జరిగిన విచారణ సమయంలో.. ముకుల్ రోహత్గీ ఆ రెండు కంపెనీలకు చెందిన మద్యం బాటిళ్లను తెచ్చి సీజే ముందు పెట్టారు. అక్కడ జరిగిన పరిణామాలను చూసి అవాక్కు అయిన బెంచ్ సభ్యులు.. గట్టిగా నవ్వి.. మీ తో బాటిళ్లు తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. రెండు కంపెనీల మద్యం సీసాల్లో ఉన్న సమానత్వాన్ని చూపేందుకు ఇలా చేయాల్సి వచ్చిందని రోహత్గీ తెలిపారు.ఈ కేసులో జరిగిన ట్రేడ్ మార్క్ ఉల్లంఘన గురించి ఆయన వివరించారు. కేసును విచారించిన ధర్మాసనం.. మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాలపై స్టే ఇచ్చింది. ఈ కేసు లో తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్లు సీజే తెలిపారు.




## సీఎం రేవంత్‌కు శుభాకాంక్షలు తెలిపిన వాసం వెంకటేశ్వర్లు



హైదరాబాద్, జనవరి 6: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన వాసం వెంకటేశ్వర్లు సీఎంకు పూలమొక్కను అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

**నేటి కందం– నేటికి అందం**

చెడు చేసెడి వారలపై
నడవడికల నెరుగనట్టి నాయకులపయిన్
పడగొట్టెడి వారలపై
తొడగొట్టెడి నేటి దినము తోషమ్ము నిడున్

(జనవరి 7 : చెడును వ్యతిరేకించే దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నవగ్రహాల్లో భూగ్రహమే జీవకోటి మనుగడకు నెలవు

అనేక గెలాక్సీలు, కోట్లాది నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలతో కూడిన అనంత అంతరిక్షంలో అత్యద్భుత అందాలు దాగి ఉన్నాయి. పాలపుంతలోని సౌర మండలంలో సూర్యుడి కేంద్రంగా నవ గ్రహాలు పరిభ్రమిస్తున్నాయి. నవ గ్రహాల్లో ఒకటైన భూగ్రహంపై మాత్రమే ప్రాణికోటి మనుగడ సాధ్యమవుతున్నది. సూర్యోదయం, సూర్యాస్తమయం, రాత్రి, పగలు, రుతువులు, గాలి పవనాలు లాంటి నిత్య అనుభవాలు భూభ్రమణ ధర్మాల మీదనే ఆధారపడి ఉంటాయి.

### లియోన్ ఫకాల్ట్ కృషి ఫలితం:

భూమి తన చుట్టు తాను తిరుగుతూ సూర్యుడి

### (08 జనవరి "భూభ్రమణ దినం" సందర్భంగా)

చుట్టు కూడా తిరుగుతున్నదని ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త తొలిసారి లియోన్ ఫకాల్ట్ 08 జనవరి 1851న ప్రతిపాదించాడు. భూమి తన చుట్టు తాను (ఉత్తర దక్షిణ ధృవాలను కలుపుతున్న నిలువు అక్షాన్ని ఆధారంగా చేసుకొని) భ్రమణం లేదా ఆత్మ ప్రదక్షిణ చెందడానికి 24 గంటల (కచ్చితంగా 23 గంటల 56 నిమిషాలు, అనగా ఒక రోజు) సమయం పడుతుంది. అలాగే భూమి సూర్యుడి చుట్టు పరిభ్రమించడానికి 365.25 రోజులు (అనగా ఒక సంవత్సరం) పడుతున్నది. ఇలాంటి అద్భుత భౌగోళిక దృగ్విషయాలను తొలిసారి ఆవిష్కరించి రుజువు చేసిన ప్రఖ్యాత ఫ్రెంచ్ భౌతికశాస్త్రవేత్త 'లియోన్ ఫకాల్ట్' చేసిన కృషికి గుర్తుగా ప్రతి ఏట 08 జనవరిన ప్రపంచ దేశాలు "భూభ్రమణ దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. దీనితో పాటు 'ఫకల్ట్' కృషితో 'గైరోస్కోప్', 'ఫకాల్ట్ పెండ్యులమ్'లను కూడా కనుగొనడం జరిగింది. ఫకాల్ట్ చేసిన కృషికి 'రాయల్ సొసైటీ వారు కాప్లే మెడల్' కూడా ప్రదానం చేశారు. భూభ్రమణాలతో రోజులు, సంవత్సరాలు ఏర్పడడమే కాకుండా రుతువులను, వివిధ నక్షత్ర రాశులు, గాలి ప్రవాహాలను (ఏయిర్ కరెంట్స్) నిర్ణయించడంలో కూడా దోహదపడుతున్నది. భూమ్యాకర్షణ అంశాన్ని 'సర్ ఐజాక్ న్యూటన్' ప్రతిపాదించిన విషయం మనకు తెలుసు.

### భూభ్రమణ దిన కార్యక్రమాలు:

08 జనవరి "భూభ్రమణ దినం" వేదికగా విద్యాలయాల్లో భూ భ్రమణాల పట్ల సంపూర్ణ అవగాహనలు ఏర్పాటు చేయడం, సైన్స్ మ్యూజియమ్‌ల సందర్శనం, వాతావరణ మార్పుల కనీస పట్ల జ్ఞానం, భూమ్యాకర్షణ పరిజ్ఞానాన్ని వివరించడం, విద్యాలయాల్లో భూభ్రమణ అంశాల్లో పోటీల నిర్వహణ, సౌరమండలం పట్ల అవగాహన లాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి. 'భూభ్రమణ దినం-2024' నినాదంగా 'మన గ్రహం మీద పెట్టుబడి పెడదాం (ఇన్వెస్ట్ ఇన్ అవర్ ప్లానెట్)' అనబడే అంశాన్ని తీసుకొని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

భూభ్రమణాలపై మాత్రమే క్యాలెండర్ ఆధారపడి ఉంటుంది. భూభ్రమణం ఆగితే ప్రపంచమే అస్తవ్యస్తం అవుతుంది. భూభ్రమణాల వేగం మారినా ప్రపంచ కాలమే అస్తవ్యస్తం అవుతుంది. జీవకోటి మనుగడ సుసాధ్యంతో పాటు భూమి ఉనికి స్థిరంగా ఉండడానికి భూభ్రమణాలు గోహదపడుతున్నాయి. జీవుల ఆవాస నెలవుగా నిలబడుతున్న భూగ్రహమే ప్రకృతి ప్రసాదించిన అపూర్వ వరమని, మన ఉనికి కోసమైనా భూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన కనీస కర్తవ్యమని అర్థం చేసుకొని, ఆరోగ్యకరంగా జీవిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఈ నెల 16 నాటికి స్వీకరించిన దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి.



సంగారెడ్డి, జనవరి 6: (నేటి నిజం ప్రతినిధి):జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరిస్తున్న అభయహస్తం దరఖాస్తుల మొత్తం డేటా ఎంట్రీ ఈనెల 16 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ప్రజాపాలన నిర్వహణ, దరఖాస్తుల డేటా ఎంట్రీపై రెవిన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు తాసిల్దారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో రానున్న రెండు రోజులు ప్రజా పాలన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహిస్తూ దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

ఎక్కడ దరఖాస్తుల కొరత లేకుండా చూసుకోవాలని, అదనంగా దరఖాస్తులను అందుబాటులో ఉంచాలని సూచించారు.

దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను మండలం/మున్సిపల్ వారీగా, టీం వారీగా నిర్ణీత సమయంలో గా పూర్తి చేసేలా ప్రణాళిక చేసుకోవాలన్నారు. టీం పరిధిలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎంతమంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు కావాలన్న దానిపై ముందస్తు ప్రణాళికతో ఆపరేటర్లను గుర్తించాలని సూచించారు .

మం డల రెవెన్యూ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్ ల పర్యవేక్షణలో డేటా ఎంట్రీ చేపట్టాలని, ఆయా నియోజకవర్గం ప్రత్యేక అధికారి, ఆయా మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏ ఒక్క దరఖాస్తు మిస్ కావద్దని, ఆధార్ రేషన్ కార్డ్ నంబర్లు తప్పులు లేకుండా ఎంట్రీ చేసేలా చూడాలని తెలిపారు. టీం వారీగా డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఆర్డర్స్ ఇవ్వాలని సూచించారు. మండల స్థాయిలో ఉన్న డాటా ఎంట్రీ ఆపరేటర్లందరి సేవలను వినియోగించుకోవాలన్నారు.

మాస్టర్ ట్రైనర్లు జిల్లా స్థాయిలో డేటా ఎంట్రీ ఏవిధంగా చేయా లన్న దానిపై డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రేపు (5న) శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అందుకు ఏర్పాట్లు చేయాలని ఆమె అధికారులకు సూచించారు.

అనంతరం పలువురు ఎంపీడీవోలు, తాసిల్దారులు, మున్సిపల్ కమిషనర్లను డాటా ఎంట్రీ చేస్తూ దరఖాస్తుల స్వీకరణ ప్రాపర్ గా జరిగేలా ఏ విధంగా ప్లాన్ చేస్తున్నారనీ కలెక్టర్ అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు.

ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ నగేష్, రెవిన్యూ డివిజనల్ అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దారులు, తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరు క్రాంతి

సంగారెడ్డి, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా కలెక్టర్ గా వల్లూరు క్రాంతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ కు చేరుకున్న నూతన జిల్లా కలెక్టర్ కు అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. నేరుగా తన చాంబర్ కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా, వైద్యం, మహిళ శిశు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నా రు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఏలాంటి ఇబ్బంది లేకుండా అందేలా చూస్తామని తెలిపారు.ప్రజాపాలన ద్వారా ప్రభుత్వ పథకాలు అన్నింటిని అధికారుల సమన్వయంతో అందిస్తామన్నారు. పట్టణ,గ్రామీణ ప్రాంతంలో ఏలాంటి సమస్యలున్నా వాటిని త్వరిత గతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

కొత్త కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు చంద్ర శేఖర్, మాధురి, జిల్లా రెవెన్యూ అధికారి నగేష్, వివిధ శాఖల అధికారులు, పత్రిక విలేఖర్లు, కలెక్టరేట్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలెక్టర్ కు పూల బొకేలు అందించి సాదరంగా కలిశారు.

# త్వరలో బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు జిల్లాలలో పర్యటన

## -ఎమ్మెల్యే మాజీ మంత్రి టి. హరీష్‌రావు

హైదరాబాద్ జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ();: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జిల్లాలలో పర్యటిస్తారని ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీష్‌రావు వెల్లడించారు. శనివారం తెలంగాణ భవన్‌లో పెద్దపల్లి పార్లమెంటు నియోజక వర్గ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ త్వరగా కోలుకుంటున్నారని, సంపూర్ణ ఆరోగ్యవంతుడై ప్రజల మధ్యలోకి వస్తారని పేర్కొ?న్నారు. ఫిబ్రవరి లో తెలంగాణ భవన్‌కు వచ్చి ప్రతి రోజూ కార్యకర్తలను కలుస్తారని వెల్లడించారు.

ప్రజల గుండెల్లో ఉన్న కేసీఆర్‌ను తొలగించలేరు..

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్లపై కేసీఆర్ గుర్తును తొలగించినా తెలంగాణ ప్రజల గుండెల నుంచి తొలగించలేరని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను రద్దులు చేస్తూ వాయిదాలు వేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక చర్యల పై ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ కార్యకర్తల పై కక్ష సాధింపు చర్యలకు దిగితే ఎమ్మెల్యేలంతా బస్సు కట్టుకుని బాధితుల వద్దకు వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. 'తెలంగాణ కోసం ఉద్యమం లో రాజీనామాలు చేశాం తప్ప రాజీ పడలేద'ని అన్నారు. ప్రభుత్వ తీరును చూస్తుంటే ఏడాదిలోనే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదనిపిస్తోందని తెలిపారు. ప్రభుత్వానికి అందజేసిన ధాన్యం డబ్బులను, రైతు బంధు పథకం డబ్బులను ప్రభుత్వం వేయలేదని పేర్కొన్నారు. పదేండ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినా ప్రతిపక్షాల దుష్ప్రచారం వల్ల ఓడిపోయామని అన్నారు.

ఓటమి స్పీడ్ బ్రేకర్ లాంటిది.. అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

మొన్నటి ఎన్నికలు కేవలం స్పీడ్ బ్రేకర్ లాంటిదని అన్నారు. 'తొలిసారి ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నాం, సత్తా ఏమిటో చూపిద్దామని ' కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పెద్దపల్లి పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని, ముందు ముందు మంచి రోజులు వస్తాయని అన్నారు



సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్.

# ఒక చిన్న ఉపగ్రహాన్ని అభివృద్ధి పరచే అంశంలో సహకారానికి సంబంధించి భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరియు మారిశస్రిసర్చ్ ఎండ్ ఇనొవేశన్ కౌన్సిల్ కి మధ్య ఒప్పందం

న్యూఢిల్లీ, జనవరి 6: ఒక చిన్న ఉపగ్రహాన్ని అభివృద్ధి పరచడం లో సహకారాని కి సంబంధించి భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కు మరియు మారిశస్ గణతంత్రాని కి చెందిన ఇన్ఫర్మేశన్ టెక్నాలజీ, కమ్యూనికేశన్ మరియు ఇనొవేశన్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లో మారిశస్ రిసర్చ్ ఎండ్ ఇనొవేశన్ కౌన్సిల్ (ఎమ్ఆర్ఐసి) కి మధ్య 2023 వ సంవత్సరం లో నవంబరు 1 వ తేదీ నాడు మారిశస్ లోని పోర్ట్ లుయి లో సంతకాలు పూర్తి అయిన ఒక అవగాహన పూర్వక ఒప్పంద పత్రం (ఎంఒయు) గురించి మాన్య ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న సమావేశమైన కేంద్ర మంత్రివర్గం దృష్టి కి తీసుకు రావడమైంది.

ఈ ఎమ్ఒయు ఒక సంయుక్త శాటిలైట్ ను అభివృద్ధి పరచడం తో పాటు గా ఎమ్ఆర్ఐసి యొక్క గ్రౌండ్ స్టేశను ను ఉపయోగించుకొనేందుకు సంబంధించిన సహకారం కోసం ఇస్రో కు మరియు ఎమ్ఆర్ఐసి కి మధ్య సహకార ప్రధానమైన ఫ్రేమ్ వర్కు ను రూపొందించడం లో కూడాను సాయపడనుంది. ఈ సంయుక్త ఉపగ్రహం తాలూకు కొన్ని ఉప వ్యవస్థల నిర్మాణం లో భారతదేశాని కి చెందిన పరిశ్రమల కు భాగస్వామ్యం దక్కనుంది; మరి ఈ ప్రక్రియ తో పారిశ్రామిక రంగాని కి లాభం కలుగుతుంది.

ఉపగ్రహాన్ని కలసికట్టు గా అభివృద్ధి పరచే మాధ్యం ద్వారా ఒనగూరే సహకారం తో మారిశస్ లో భారతదేశం ఏర్పాటు చేసిన గ్రౌండ్ స్టేశన్ కు మారిశస్ ప్రభుత్వం వైపు నుండి నిరంతర సమర్థన లభించేలా అండ లభించగలదు. ఈ విధమైనటువంటి సహకారం ఇస్రో/ భారతదేశం చేపట్టేటటువంటి వాహక నౌకలు మరియు ఉపగ్రహ ఆధారిత మిశన్ లకు కీలకం అని చెప్పాలి. దీని కి అదనం గా, ఈ సంయుక్త ఉపగ్రహ నిర్మాణం భవిష్యత్తు లో ఇస్రో యొక్క స్మాల్ శాటిలైట్ మిశన్ కు ఎమ్ఆర్ఐసి యొక్క గ్రౌండ్ స్టేశన్ ద్వారా సమర్థన కు సైతం వీలు కలుగుతుంది. ఈ జాయింట్ శాటిలైట్ కు నబ్ సిస్టమ్స్ కొన్నిటి ని రూపొందించడం లో భారతదేశం లోని పరిశ్రమలు పాలుపంచుకోనున్నాయి. ఈ విధం గా ఉద్యోగాల కల్పన కు ఆస్కారం ఏర్పడుతుంది.

ఈ ఎమ్ఒయు పై సంతకాలు కావడం తో ఇస్రో మరియు ఎమ్ఆర్ఐసి ల మధ్య చిన్న ఉపగ్రహం తాలూకు సంయుక్త కార్యాచరణ సాధ్యపడనుంది. ఈ శాటిలైట్ కు తుది రూపు ను ఇవ్వడాన్ని 15 నెలల కాలావధి లోపల పూర్తి చేయాలి అని ప్రతిపాదించడమైంది.

ఈ సంయుక్త ఉపగ్రహాన్ని పూర్తి స్థాయి లో తయారు చేయడానికి సుమారు గా 20 కోట్ల రూపాయలు ఖర్చు కావచ్చని అంచనా. ఈ ఖర్చు ను భారత ప్రభుత్వం భరిస్తుంది. ఈ ఎమ్ఒయు లో సంబంధి పక్షాల మధ్య మరే ఇతర నిధుల ఆదాన ప్రదానం ఉండబోదు.

భారతదేశం మరియు మారిశస్ ల మధ్య అంతరిక్ష రంగం లో సహకారం 1980 వ దశాబ్దం ఉత్తరార్థం లో మొదలైంది. అప్పట్లో ఇస్రో ఈ లక్ష్య సాధన కై 1986 లో సంతకాలు అయినటువంటి దేశ స్థాయి ఒప్పందం లో భాగం గా ఇస్రో యొక్క వాహక నౌక మరియు శాటిలైట్ మిశన్ ల కోసం ట్రేకింగ్ ఎండ్ టెలిమెట్రీ సంబంధి రంగం లో సహాయార్థం మారిశస్ లో ఒక గ్రౌండ్ స్టేశను ను ఏర్పాటు చేసింది. వర్తమాన అంతరిక్ష సహకారం 29.7.2009 న సంతకాలు అయినటువంటి దేశాల స్థాయి ఒప్పందం ఆధ్వర్యం లో అమలువుతున్నది. ఇది పైన ప్రస్తావించిన 1986లో కుదిరిన ఒప్పందానికి బదులు గా కుదిరిన ఒప్పందం అన్నమాట.

మారిశస్ కోసం ఒక చిన్న ఉపగ్రహాన్ని సంయుక్తం గా నిర్మించాలి అంటూ ఎమ్ఆర్ఐసి కనబరచిన ఆసక్తి ఆధారం గా, భారతదేశం-మారిశస్ సంయుక్త ఉపగ్రహం రూపకల్పన కు సంబంధించిన చర్చల ను ఎమ్ఆర్ఐసి తో మొదలు పెట్టవలసిందిగా ఇస్రో ను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎమ్ఇఎ) అభ్యర్థించింది. ఆ తరహా జాయింట్ శాటిలైట్ రూపకల్పన కు మరియు ఆ శాటిలైట్ ను కక్ష్య లో ప్రవేశపెట్టేందుకు మరియు దానిని నిర్వహించేందుకు నిధుల ను ఎమ్ఇఎ సమకూర్చుతుంది. ఈ ఎమ్ఒయు పై 2023 నవంబరు 1 వ తేదీ న మారిశస్ లోని పోర్ట్ లుయి లో 'అప్రవాసి దివస్' కార్యక్రమం లో పాలుపంచుకోవడానికని విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి మారిశస్ కు వెళ్ళినప్పుడు సంతకాలు చేయడమైంది.

# ఆర్టీసీ బస్సు బోల్తా- ఆరుగురికి స్వల్ప గాయాలు

ఖమ్మం, జనవరి 6:ఆర్టీసీ బస్సు బోల్తాపడడంతో ఆరుగురికి స్వల్ప గాయాలైన ఘటన తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట జిల్లాలో చోటుచేసుకుంది.

జిల్లాలోని మోతె మండలం మామిళ్ళగూడెం వద్ద సూర్యాపేట - ఖమ్మం నేషనల్ హైవే 365 బీబీ రహదారిపై హైదరాబాద్ నుంచి ఖమ్మం వస్తున్న ఖమ్మం డిపో కి చెందిన రాజధాని ఏసీ బస్సు బోల్తా పడింది.

ఈ ప్రమాదంలో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# హైదరాబాద్‌లో జరగాల్సిన ఫార్ములా ఈ రేస్ రద్దు

హైదరాబాద్ జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): హైదరాబాద్‌లో జరగాల్సిన ఫార్ములా ఈ రేస్ ను రద్దు చేశారు. ఈ-రేస్ సీజన్ 10కు చెందిన నాలుగవ రౌండ్ హైదరాబాద్‌లో ఫిబ్రవరి 10వ తేదీన జరగాల్సి ఉంది. అయితే ఆ రేస్‌ను రద్దు చేస్తున్నట్లు ఫార్ములా ఈ రేస్ నిర్వాహకులు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన మున్సిపల్ శాఖ.. హోస్ట్ సిటీ ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు నిర్వాహకులు తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 30వ తేదీ జరిగిన ఒప్పందాన్ని మున్సిపల్ శాఖ ఉల్లంఘించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రేస్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ఫార్ములా ఈ ఆపరేషన్స్.. మున్సిపల్ శాఖకు నోటీసులు జారీ చేసినట్లు చెప్పింది. కాంట్రాక్టును ఉల్లంఘించినందుకు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నది. హోస్ట్ సిటీ అగ్రిమెంట్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ఎఫ్‌ఈవో తెలిపింది.గత తెలంగాణ సర్కార్, ఫార్ములా ఈ మధ్య ఈరేస్ ఒప్పందం జరిగింది. కానీ ప్రస్తుతం తెలంగాణ సర్కార్ ఆ ఒప్పందాన్ని బ్రేక్ చేసింది. సీజన్ 10 రేస్‌లు జరగనున్న నగరాల్లో టోక్యో, షాంఘై, బెర్లిన్, మొనాకో, లండన్ నగరాలు ఉన్నాయి. జనవరి 13వ తేదీ నుంచి ఈ సీజన్ ప్రారంభంకానున్నది. మెక్సికోలోని హాంకూక్ లో తొలి రేస్ జరగనున్నది.తెలంగాణ సర్కారు తీసుకున్న తాజా నిర్ణయం తమను నిరాశపరిచినట్లు ఫార్ములా ఈ చీఫ్ చాంపియన్‌షిప్ ఆఫీసర్ ఆల్బర్టో లాంగో తెలిపారు. భారత్‌లో మోటర్‌స్పోర్ట్స్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసినట్లు చెప్పారు. వరల్డ్ చాంపియన్‌షిప్ రేస్ ఈవెంట్‌ను హైదరాబాద్ నిర్వహించడం కీలకమైందని, కానీ దురదృష్టవశాత్తు తెలంగాణలో ఏర్పడ్డ కొత్త సర్కార్ నిర్ణయం వల్ల ఆ ఈవెంట్‌ను నిర్వహించలేకపోతున్నట్లు ఆల్బర్టో తెలిపారు.గత ఏడాది జరిగిన ప్రారంభోత్సవ రేస్ చాలా సక్సెస్ అయ్యిందని, ఆ రేస్ వల్ల ఆ ప్రాంతంలో సుమారు 84 మిలియన్ల డాలర్ల ఆర్థిక ప్రగతి జరిగిందని ఫార్ములా ఈ సీఈవో జెఫ్ డోడ్స్ తెలిపారు.

# కాంగ్రెస్ దుష్ప్రచారంతోనే ఓటమి -హరీష్ రావు




హైదరాబాద్, జనవరి 6: అభివృద్ధి చేసినా దుష్ప్రచారం వల్ల తాము ఓడిపోయామన్నారు మాజీ మంత్రి హరీష్ రావు. తెలంగాణ భవన్ లో శనివారం జరిగిన పెద్దపల్లి పార్లమెంటు నియోజక వర్గ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లి పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని పిలుపు ఇచ్చారు. ఎవరూ అధైర్య పడొద్దని కోరారు. ముందు ముందు మనకు మళ్ళీ మంచి రోజులు వస్తాయి. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా పార్టీ నడుస్తుందన్నారు.

కేసీఆర్ కోలుకుంటున్నారని.. త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యవంతుడై ప్రజల మధ్యలోకి వస్తారన్నారు. ఫిబ్రవరిలో తెలంగాణ భవన్‌కి వచ్చి ప్రతి రోజూ కార్యకర్తలను కలుస్తారని స్పష్టం చేశారు.

త్వరలోనే కేసీఆర్ జిల్లాల పర్యటనలు ఉంటాయన్నారు. కిట్ మీద కేసీఆర్ గుర్తును కాంగ్రెస్ ప్రభుత్వం చెరిపేస్తోంది కానీ తెలంగాణ ప్రజల గుండెల నుంచి తొలగించలేరన్నారు.

కాంగ్రెస్ ది రద్దుల ప్రభుత్వమే..

కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నారని హరీష్ రావు ఫైర్ అయ్యారు.. కాంగ్రెస్ ప్రభుత్వం రద్దులు వాయిదాలు అన్నట్టుగా నడుస్తోందన్నారు. కాంగ్రెస్ విపరీత చర్యలపై ఉద్యమిస్తామని వార్నింగ్ ఇచ్చారు.. బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు దిగితే ఎమ్మెల్యేలం అంతా బస్సు కట్టుకుని భాదితుల దగ్గరకు వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు.. . కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పేర్కొన్నారు.

### ఉద్యమం కోసం రాజీనామాలు చేసిన చరిత్ర మాది..

తెలంగాణ కోసం ఉద్యమంలో రాజీనామాలు చేశాం తప్ప రాజీ పడలేదన్నారు మంత్రి హరీష్ .. ఈ ప్రభుత్వ తీరు చూస్తుంటే ఏడాది లోనే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదనిపిస్తోందని జ్యోస్యం చెప్పారు.. ఇక కొన్ని చోట్ల వడ్ల పైసలు కూడా పడలేదని, అలాగే రైతు బంధు కూడా వేయలేదన్నారు..ఇలా అయితే . రైతు వ్యవసాయం ఎలా చేయాలని ప్రశ్నించారు. తొలిసారి ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామని, తమ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు.

# అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

## -సమ్మెను నిషేధిస్తూ జీవో జారీ

అమరావతి జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );.: డిమాండ్లు పరిష్కారించాలని గత 26 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్మా ప్రయోగించింది. సమ్మెను నిషేధిస్తూ జీవో జారీచేసింది. అంగన్వాడీలను అత్యవసర సర్వీసుల కిందకు తెస్తూ జీవో నంబర్.2ను విడుదల చేసింది. అదేవిధంగా సమ్మె చేసిన కాలానికి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల వేతనంలో కోత విధించింది. రూ.3 వేలు తగ్గించి రూ.8050 వేతనాన్ని వారి ఖాతాల్లో జమచేసింది.వేతనాల పెంపు సహా ఇతర సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు డిసెంబర్ 11న సమ్మె బాటపట్టారు. సమ్మెను విరమింపజేసేందుకు ప్రభుత్వం వారితో రెండు పర్యాయాలు జరిపిన చర్చలు విఫమయ్యాయి. దీంతో తమ డిమాండ్లను పరిష్కరించేవరకు సమ్మెను కొనసాగిస్తామని అంగన్వాడీలు స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# అమ్మనే గెంటేసిన వాడికి అంగన్‌వాడీల విలువ ఏం తెలుస్తుంది

## -అంగన్వాడీలపై సమ్మెపై ఎస్మా ప్రయోగించడాన్ని తప్పుబట్టిన నారా లోకేష్





అమరావతి జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : డిమాండ్లు పరిష్కారించాలని గత 26 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై సమ్మెపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని టీడీపీ జాతీయకార్యదర్శి నారా లోకేష్‌మండిపడ్డారు. అంగన్‌వాడీలు శాంతియుతంగా ఆందోళన చేయడం కూడా ఒక నేరమా అంటూ జగన్ ప్రభుత్వాన్నిప్రశ్నించారు. 'అమ్మనే గెంటేసిన వాడికి అంగన్‌వాడీల విలువ ఏం తెలుస్తుందని' అన్నారు. అంగన్‌వాడీ వేతనాల్లో కోత విధించడం నియంత పోకడలకు నిదర్శనమని దుయ్యబట్టారు. అంగన్‌వాడీల సమ్మెను నిషేదిస్తూ తీసుకొచ్చిన జీవో 2ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల ఉద్యమానికి టీడీపీ సంపూర్ణ మద్దతు ఉంటుందని వెల్లడించారు. జగన్ అహంకారానికి, అంగన్‌వాడీల ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్న ఉద్యమంలో అంతిమ విజయం అంగన్‌వాడీలదేనని అన్నారు.

# సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజలు



సంగారెడ్డి, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి):చింతా ప్రభాకర్ సంగారెడ్డి ఎమ్మెల్యే గా విజయం సాధించిన తరువాత మొదటి సారిగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చారు.

ముందుగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొన్నారు.శ్రీ వైకుంఠపురం ప్రధాన అర్చకులు వరదాచార్యులు చింతా ప్రభాకర్ ను కలిసి వేద పండితుల వేదమంత్రాల నడుమ ఆశీర్వచనములు అందజేశారు.

తదనంతరం శాలువాతో సన్మానించి , ఆలయ జ్ఞాపికను ఇచ్చి ప్రసాదాలు అందజేశారు. యోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు , బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున చింతా ప్రభాకర్ ను అభినందనలు తెలిపారు .

# ముంబై లోని పలు సంస్థలకు బాంబు బెదిరింపులు కలకలం

## -ఛత్రపతి శివాజీ మ్యూజియం సహా 8 సంస్థలకు బాంబు బెదిరింపులు

ముంబై జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ముంబై లోని పలు సంస్థలకు బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. 8 సంస్థలను లక్ష్యంగా చేసుకొని కొందరు ఈ బెదిరింపులకు పాల్పడ్డారు. ముంబై కొలాబా ప్రాంతంలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ మ్యూజియం వర్లీలోని నెహ్రూ సైన్స్ సెంటర్ బైకుల్లా జూ సహా పలు సంస్థలను బాంబులతో పేల్చేస్తామంటూ బెదిరించారు. శుక్రవారం సాయంత్రం ఆయా సంస్థలకు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. ముందుగా మ్యూజియంకు బెదిరింపు మెయిల్ వచ్చినట్లు చెప్పారు.బెదిరింపు మెయిల్స్‌తో అప్రమత్తమైన అధికారులు నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అదేవిధంగా బెదిరింపులు వచ్చిన సంస్థల వద్దకు బాంబ్ స్క్వాడ్ చేరుకొని తనిఖీలు చేపట్టింది. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ కనిపించలేదు. ఆయా సంస్థలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈమెయిల్స్ ఆధారంగా నిందితుల్ని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు కొలాబా పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులపై సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.కాగా, గత కొన్ని రోజులుగా దేశంలోని పలువురు ప్రముఖులు, పారిశ్రామివేత్తలు, విమానాశ్రయాలు, బ్యాంకులు, ప్రముఖ ఆలయాలకు బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. గతేడాది డిసెంబర్‌లో ముంబైలోని పలు బ్యాంకులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులకు ఖిలాఫత్ ఇండియా మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. ఆ తర్వాత ఢిల్లీ, జైపూర్, లక్నో, చండీగఢ్, ముంబై, చెన్నై, అమ్మదాబాద్ ఎయిర్‌పోర్టులపై బాంబు దాడి చేయబోతున్నట్లు కొందరు ఆగంతకులు ఈమెయిల్ ద్వారా బెదిరించారు. గురువారం కూడా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కు బాంబు బెదిరింపులు వచ్చాయి. అయోధ్యలో నిర్మించిన రామ మందిరం తో సహా పేల్చేస్తామంటూ సీఎంను బెదిరించారు. ఆ తర్వాత నిన్న అంటే శుక్రవారం కోల్‌కతా లోని ఇండియన్ మ్యూజియం కు బాంబు బెదిరింపులు వచ్చాయి.

# జార్ఖండ్‌లోని బొగ్గు గనుల జిల్లాలలో విద్యాపరమైన పరివర్తన కోసం EdCILతో కోల్ ఇండియా లిమిటెడ్ భాగస్వామ్యం



న్యూఢిల్లీ, జనవరి 6: కోల్ ఇండియా లిమిటెడ్ (CIL), ఒక మహారత్న PSU స్థిరమైన మరియు సామాజిక బాధ్యత కలిగిన పద్ధతులకు కట్టుబడి ఉంది. దాని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) కింద, ఐసీటీ విద్యా రంగాన్ని ఉద్ధరించడానికి మరియు దాని ద్వారా దాని మైనింగ్ కమాండ్ ప్రాంతాల నివాసితులకు సాధికారత కల్పించడానికి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటుంది. ఐసీటీ (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) ఆధారిత అభ్యాసాన్ని ఈరోజు ఆధునిక బోధనా విధానంగా ఎక్కువగా అవలంబిస్తున్నందున, CIL 03.01.2024న "జార్ఖండ్‌లోని పదకొండు జిల్లాలలో డిజిటలైజింగ్ ఎడ్యుకేషన్" కోసం EdCIL (ఇండియా) లిమిటెడ్‌తో ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. న్యూ ఢిల్లీ వద్ద.

బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీమతి రూపిందర్ బ్రార్ సమక్షంలో ఎంఓయూపై సంతకాలు చేశారు. భారతదేశం Sh. వినయ్ రంజన్, డైరెక్టర్ (P&IR), కోల్ ఇండియా లిమిటెడ్ మరియు శ్రీ. మనోజ్ కుమార్, CMD, EdCIL (ఇండియా) లిమిటెడ్. CIL యొక్క అనుబంధ సంస్థల నుండి డైరెక్టర్లు (పర్సనల్)తో పాటు బొగ్గు మంత్రిత్వ శాఖ మరియు ఇతర బొగ్గు కంపెనీల నుండి ప్రముఖులు.

మూడేళ్ల వ్యవధిలో జార్ఖండ్‌లోని 11 జిల్లాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. ఈ జిల్లాల్లో ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ECL), భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (BCCL ) మరియు సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (CCL ) అనే CIL యొక్క మూడు అనుబంధ సంస్థల మైనింగ్ ప్రాంతాలు ఉన్నాయి. ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ. 27.08 కోట్లు. గుర్తించబడిన ప్రతి పాఠశాలలో ఒక స్మార్ట్ క్లాస్‌రూమ్ మరియు ఒక ఐసీటీ (ఇన్ఫర్మేషన్ ఆండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) ల్యాబ్‌ని ఏర్పాటు చేస్తారు. ప్రాజెక్ట్‌లో ఉపాధ్యాయుల శిక్షణ మరియు వ్యవస్థాపించిన పరికరాల యొక్క మూడు సంవత్సరాల నిర్వహణ కూడా ఉంది.

కొత్త ఎడ్యుకేషన్ పాలసీ 2020కి అనుగుణంగా ఉన్న ఈ చొరవ, బొగ్గు జిల్లాల్లో విద్యను పెంపొందించడానికి సాంకేతికతను ఉపయోగించుకోవడంలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. విక్షిత్ భారత్ మరియు ఆత్మనిర్భర్ భారత్ అనే ప్రభుత్వ విజన్‌ని నెరవేర్చడానికి ఇది ఒక ముందడుగు. ఈ ప్రాజెక్ట్ అభ్యసన ఫలితాలను మెరుగుపరిచే గొప్ప విద్యా కంటెంట్‌తో విద్యార్థులను శక్తివంతం చేస్తుంది. CIL సానుకూల మార్పును తీసుకురావడానికి మరియు దాని CSR కార్యకలాపాల ద్వారా కమ్యూనిటీలకు ఉజ్వల భవిష్యత్తును అందించడానికి కట్టుబడి ఉంది.

# జీవనశైలి, ఆహారపు అలవాట్లు వల్లే మధుమేహం

## -మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ లిల్లీ మేరి

హైదరాబాదు జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జన్యు కారణాల వల్ల వచ్చే మధుమేహాని పక్కన పెడితే, ఈ మధ్యకాలంలో ఎక్కువమందికి జీవనశైలి, ఆహారపు అలవాట్లు వల్లే మధుమేహం వస్తుందని ఇది అన్ని వయసుల వారిలోనూ కనిపించడం ఒక ప్రమాదకరమైన సంకేతం అని దీనికి కొన్ని కారణాలు ఉన్నాయని మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ లిల్లీ మేరి అన్నారు. నేడు మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలాజీ నగర్లో ఉచిత మధుమేహ రక్త పరీక్షలు నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ లిల్లీ మేరి మాట్లాడుతూ మన శరీరానికి అవసరమైన శక్తి మనం చేసే శారీరక శ్రమపై కూడా ఆధారపడి ఉంటుందని, తక్కువ శారీరక శ్రమ చేసేవారు ఎక్కువ ఆహారాన్ని తింటే ప్రతికూల ఫలితాలు వస్తాయని, అదనముగా చేరిన గ్లూకోజు కాలేయంలోను, పొట్టలోను కొవ్వు రూపంలో పేరుకు పోతుందన్నారు. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళితే మధుమేహానికి రివర్స్ గేరు వేయటం సాధ్యమవుతుందని లిల్లీ మేరి తెలిపారు.

# ఏపీలో జనసేనతో బీజేపీ పొత్తు ఉంటుంది : పురంధేశ్వరి

అమరావతి జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఏపీలో జనసేనతో పొత్తు ఉంటుందా? లేదా? అన్న విషయంపై ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురంధేశ్వరి క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతానికి జనసేనతో పొత్తులో ఉన్నామని స్పష్టం చేశారు. బీజేపీతోనే ఉన్నామని జనసేన కూడా చెప్పిందని గుర్తు చేశారు. నిన్న మొన్న కార్యకర్తలతో మాట్లాడి పొత్తులపై అభిప్రాయాలను సేకరించామని తెలిపారు. అభిప్రాయ సేకరణ పూర్తయిన తర్వాత ఆ నివేదికను హైకమాండ్‌కు పంపిస్తామని దగ్గుబాటి పురంధేశ్వరి చెప్పారు. పొత్తులపై తుది నిర్ణయం అధిష్ఠానమే తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇది ఎన్నికలకు ఒక నెల ముందు నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.

# సగం ఆడ, సగం మగ.. రెండు లక్షణాలున్న అరుదైన పక్షి..!

## -కొలంబియాలో గుర్తించిన శాస్త్రవేత్తలు

## -వందేండ్లలో ఇది రెండో ఘటన

న్యూ డిల్లీ జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సగం ఆడ-సగం మగ.. రెండు లక్షణాలున్న అరుదైన పక్షిని చూశారా.. న్యూజిలాండ్ శాస్త్రవేత్త, యూనివర్సిటీ ఆఫ్ ఒటాగో జంతు శాస్త్రజ్ఞుడు ప్రొఫెసర్ హమీష్ స్పెన్సర్, కొలంబియాలో ఇలాంటి అరుదైన పక్షిని గుర్తించారు. సగం ఆకుపచ్చ, సగం నీలం రంగులతో ఈ పక్షి ఉంటుంది.

ఈ పక్షికి ఆడ, మగ రెండు పునరుత్పత్తి అంగాలు ఉన్నాయి. జన్యుపరమైన లోపాలే ఇందుకు కారణమని శాస్త్రవేత్త తెలిపారు.

# 8వ రౌండ్ వాణిజ్య బొగ్గు గనుల వేలానికి విపరీతమైన స్పందన

న్యూఢిల్లీ, జనవరి 6: 8వ రౌండ్ వాణిజ్య బొగ్గు గనుల వేలాన్ని నవంబర్ 15, 2023న కేంద్ర బొగ్గు, గనులు మరియు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి ప్రారంభించారు. రౌండ్ కోసం ప్రీ-బిడ్ సమావేశం డిసెంబర్ 12, 2023న జరిగింది మరియు ప్రీ-బిడ్ సమావేశంలో 50 కంటే ఎక్కువ మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

8వ రౌండ్ కోసం బిడ్‌లను సమర్పించడానికి చివరి తేదీ జనవరి 29, 2024. 8వ రౌండ్‌లో స్వీకరించిన బిడ్‌లు జనవరి 30, 2024న బిడ్డర్ల సమక్షంలో తెరవబడతాయి.

8వ రౌండ్‌లో, 39 బొగ్గు గనులు అందించబడ్డాయి, వీటిలో 35 బొగ్గు గనులు 8వ రౌండ్‌లో ది77 మిలియన్ టన్నుల (ఓ) సంచిత పీక్ రేటెడ్ కెపాసిటీ ఖఖీఅతో అందించబడ్డాయి మరియు 7వ రౌండ్‌లో రెండవ ప్రయత్నంలో నాలుగు బొగ్గు గనులు అందించబడ్డాయి. 30 ఓ యొక్క సంచిత ఖఖీఅ. కొనసాగుతున్న 8వ రౌండ్‌కు పరిశ్రమ నుండి అధిక స్పందన లభించింది, ఇది అనేక సైట్-విజిట్ అభ్యర్థనలతో పాటు బిడ్డర్‌ల సంఖ్య నుండి చాలా ప్రశ్నలు స్వీకరించబడ్డాయి. జూన్ 2020లో ప్రధానమంత్రి ప్రారంభించిన పారదర్శక వాణిజ్య బొగ్గు వేలం విధానంపై పరిశ్రమకు ఉన్న నమ్మకాన్ని ఇది చూపిస్తుంది.

# షర్మిల కాంగ్రెస్‌లో చేరిక వెనుక చంద్రబాబు కుట్ర ఉంది

## -ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

అమరావతి జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కాంగ్రెస్‌లో షర్మిల పార్టీ విలీనంపై ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పందించారు. కాంగ్రెస్‌లో షర్మిల చేరిక వెనుక చంద్రబాబు కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. షర్మిల రాజకీయంగా ఎక్కడి నుంచైనా ప్రాతినిథ్యం వహించవచ్చని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఏపీలో భవిష్యత్తు లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీని తాము పట్టించుకోబోమని అన్నారు. షర్మిల వల్ల వైసీపీకి వచ్చే నష్టమేమీ లేదని స్పష్టం చేశారు. సీఎం జగన్‌కు కుటుంబం కంటే ప్రజలే ముఖ్యమని సజ్జల స్పష్టం చేశారు. కుటుంబం కోసం జగన్ పార్టీ పెట్టలేదని.. తమ విధానాలు తమకు ఉన్నాయని అన్నారు. పార్టీని వీడటానికి కారణం వాళ్లే చెప్పారని అన్నారు. అంబటి రాయుడు ఎందుకు రాజీనామా చేశారో తెలియదని అన్నారు. కొద్దిరోజులు దూరంగా ఉంటానని చెప్పారని చెప్పారు. వైఎస్ మరణంపై మాకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై కూడా అనుమానం ఉందని తెలిపారు.

# ఆరు బొగ్గు గనులు కమర్షియల్ వేలం కింద ఉత్పత్తిని ప్రారంభించగా, మరో మూడు త్వరలో కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం

న్యూఢిల్లీ, జనవరి 6: మూడేళ్ల క్రితం బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రారంభించిన కమర్షియల్ బొగ్గు గనుల వేలం కింద ఇప్పటివరకు 91 గనులను విజయవంతంగా వేలం వేశారు. ఈ కేటాయించిన గనుల్లో ఇప్పటికే ఆరు వాణిజ్య గనులు బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించగా, మరో మూడు నెలల్లో ఉత్పత్తి ప్రారంభించే అవకాశం ఉంది.

నాలుగు రాష్ట్రాలకు చెందిన 31 బొగ్గు గనులను వేలానికి అందజేస్తూ, 9వ విడత వేలం డిసెంబర్, 2023లో ఇటీవలే ప్రారంభించబడింది. బొగ్గు/ లిగ్నైట్-బేరింగ్ రాష్ట్రాలైన జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ మరియు తెలంగాణలకు సంబంధించిన గనులు 9వ విడత వేలం కిందకు వస్తాయి. 2020లో ప్రధాని ప్రారంభించిన పూర్తిగా పారదర్శకమైన ఆన్‌లైన్ వేలం కింద బొగ్గు మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు ఏడు రౌండ్ల వేలాన్ని విజయవంతంగా పూర్తి చేసింది.

ఇప్పటికే వేలం వేసిన గనుల నుంచి బొగ్గు తవ్వకం ద్వారా ఏటా రూ. 33,343 కోట్లు, సంవత్సరానికి 220.90 మిలియన్ టన్నుల (ఓఖం) గరిష్ట స్థాయి సామర్థ్యం స్థాయిని పరిగణనలోకి తీసుకుంటే.

ఈ గనులు పూర్తి స్థాయిలో పని చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు మూడు లక్షల మందికి ఉపాధి లభిస్తుంది.

కమర్షియల్ బొగ్గు గనుల ద్వారా దేశానికి కొత్త పెట్టుబడులు వస్తాయని, వేలం ద్వారా వచ్చే మొత్తం ఆదాయాన్ని జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు కేటాయించాలని భావిస్తున్నారు. , బీహార్ మరియు అస్సాం.

# డాటా ఎంట్రీ వంద శాతం కరెక్టుగా ఉండాలి

## -జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి.

సంగారెడ్డి, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి): ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులన్నింటిని పూర్తి పారదర్శకతతో పకడ్బందీగా ఆన్లైన్లోనమోదు చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు ఆదేశించారు.

శనివారం మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలతో ప్రజాపాలన గ్రామ సభల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల డేటా ఎంట్రి ప్రక్రియపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డేటా ఎంట్రీ ప్రక్రియ ప్రారంభించాలని, క్వాలిటీ డేటా ఎంట్రీ కావాలని, తప్పులు లేకుండా చేయాలని సూచించారు .

వెబ్‌సైట్ లాగిన్స్ కేటాయించడం జరిగిందని, ప్రతి ఒక్క దరఖాస్తు ఆన్లైన్లో నమోదు చేయాలని పూర్తి జాగ్రత్తలతో ఎలాంటి తప్పులు లేకుండా డేటా నమోదు చేయించాలని సూచించారు. ప్రతి మున్సిపల్ వార్డు, ప్రతి గ్రామపంచాయతీలో స్వీకరించిన దరఖాస్తులను క్రాస్ చెక్ చేసుకోవాలని, ప్రాపర్ గా ఎంట్రీ చేయాలన్నారు. సంబంధిత పర్యవేక్షణ అధికారులు బాధ్యతగా డేటా ఎంట్రీ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా పర్యవేక్షించాలన్నారు.

డేటా ఎంట్రి పూర్తి కాగానే దరఖాస్తులను జాగ్రత్తగా భద్రపంచాలని సూచించారు.

ఇంకా డేటా ఏంట్రీ ప్రారంభించని వారు లాగిన్స్ క్రియేట్ చేయించి ఈరోజు నుండి చేయించాలని సంబంధిత ఎం పి డి ఓ లకు తెలిపారు. ఎక్కడైనా కంప్యూటర్ సిస్టమ్స్ అవసరం ఉన్నట్లైతే ఆర్డిఓ ల కోఆర్డినేషన్ తో సమకూర్చుకోవాలని ఎంపీడీవోలకు సూచించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి కావాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా పలువురు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఎన్ని దరఖాస్తులు వచ్చాయి ,ఎంతమంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఏర్పాటు చేసుకున్నారు? లాగిన్స్ ఇచ్చారా? రోజుకు ఎన్ని పూర్తి చేయాలన్న ప్లానింగ్ చేసుకున్నారూ?ఇప్పటి వరకు ఎన్ని పూర్తయ్యాయి అంటూ అడగగా, ఆయా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సంబంధిత వివరాలను కలెక్టర్కు వివరించారు.

టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి పాలేరు క్యాంప్ కార్యాలయ ప్రవేశ పూజలు



ఖమ్మం, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ప్రభుత్వం అధికారికంగా కేటాయించిన కూసుమంచిలోని పాలేరు నియోజకవర్గ క్యాంప్ కార్యాలయ ప్రవేశ పూజలు శనివారం జరిగాయి. మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, ముఖ్య నాయకులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అంతా విజయవంతం కావాలని ఈ సందర్భంగా వారు మొక్కుకున్నారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి కార్యాలయంలోకి ప్రవేశించారు. మంత్రి పొంగులేటి నేతృత్వంలో ప్రజలందరికీ సుపరిపాలన అందించేలా.. ఈ కార్యాలయం ఎంతో ఉపయోగపడుతుందని దయాకర్ రెడ్డి ఆకాంక్షించారు. పాలేరు నియోజక వర్గంతో పాటు ఇతర నియోజక వర్గాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి, ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి, చావా శివ రామకృష్ణ, నేలకొండపల్లి ఎంపీపీ వజ్జా రమ్య, తిరుమలాయపాలెం ఎంపీపీ బోడ మంగీలాల్, కూసుమంచి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మట్టే గురవయ్య, ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కళ్లెం వెంకట్ రెడ్డి, మద్ది వీరా రెడ్డి, బైరు హరినాథ్ బాబు, సర్పంచ్ లు గోనె భుజంగ రెడ్డి, శివా రెడ్డి, కె.వి. చారి, మద్ది కిషోర్ రెడ్డి, అజ్మీరా అశోక్ నాయక్, కొప్పుల చంద్ర శేఖర్, సుదాగని ఉపేందర్, మాజీ ఎంపీపీలు రామసహాయం వెంకటరెడ్డి, జూకూరి గోపాల్ రావు, కొంగర జ్యోతిర్మయి, ఉమ్మినేని కృష్ణ, యడవల్లి ముత్తయ్య, బజ్జూరి వెంకట్ రెడ్డి, హఫీజుద్దీన్, యడవల్లి రాంరెడ్డి, బారి వీరభద్రం, మదాసు ఉపేందర్, ఇందుర్తి వెంకట్ రెడ్డి, లెనిన్, సర్పంచ్ ఖాదర్ బాబా, నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవింద రావు, శాఖమూరి రమేష్, కుక్కల హనుమంత రావు, వెన్నపూసల సీతారాములు, మామిడి వెంకన్న తదితరులున్నారు.

# ఖమ్మంలో నూతనంగా డేజిల్(అతిరిషర్)షోరూమ్ ని ప్రారంభించిన ఖమ్మం ఏసీపీ



ఖమ్మం, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి): స్థానిక బైపాస్ రోడ్డులోని సిపిఐ ఆఫీసు దగ్గర్లో శనివారం ఉదయం నూతనంగా డేజిల్(అతిరిశుర్)షోరూమ్ ని ఖమ్మం ఎసిపి ఎస్ .వి హరికృష్ణ స్థానిక కార్పొరేటర్ యం.డి రఫీదా బేగం 57వ డివిజన్ కార్పొరేటర్ రిబ్బన్ కట్ చేసి జ్యోతి వెలిగించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం ఎసిపి మాట్లాడుతూ...ఖమ్మంలో ఇలాంటి బ్రాండ్లు మరెన్నో రావాలని ప్రజలకు ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకు అనుగుణంగా ఉన్నాయని ఈ షాపుని ఖమ్మం పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఖమ్మంలో షో రూమ్ లు ప్రజలకు అందుబాటు ధరలు ఉన్నాయని ఆయన అన్నారు. ఇలాంటి షో రూమ్ లో ఖమ్మం కార్పొరేషన్ కి మరిన్ని రావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజిరెడ్డి, పాలడుగు వెంకటేశ్వర్లు, డేజిల్(అతిరిశుర్)షో రూమ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డేజిల్(అతిరిషర్)షోరూమ్ ఓనర్ బొబ్బిలి రితికేష్ రెడ్డి, కే.కుమార్ స్వామి, ఏ.మధుకర్ రెడ్డి, ఎం. సత్యంబాబు, ముస్తఫా తదితరులున్నారు.

# NCC రిపబ్లిక్ డే క్యాంప్ 2024ను వైస్ ప్రెసిడెంట్ లాంఛనంగా ప్రారంభించారు

న్యూఢిల్లీ, జనవరి 6: వైస్ ప్రెసిడెంట్ శ్రీ జగదీప్ ధన్‌ఖర్, యువశక్తిని సానుకూలత కోసం మళ్లించడం ద్వారా యువత అభివృద్ధి మరియు జాతీయ పురోగతి యొక్క కొత్త శకానికి నాంది పలికినందుకు ఔఅఅని ప్రశంసించారు. ఎన్‌సిసి క్యాడెట్‌లను భారత్ ఎదుగుదలలో ముఖ్యమైన వాటాదారులుగా అభివర్ణించిన ఉపరాష్ట్రపతి, వారు దేశ యువతకు రోల్ మోడల్‌లని అన్నారు.

జనవరి 05, 2024న న్యూ ఢిల్లీలో NCC రిపబ్లిక్ డే క్యాంప్ 2024 లాంఛనప్రాయ ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీ ధంఖర్ ప్రసంగిస్తూ, "క్యాడెట్ స్ఫూర్తి శాశ్వతమైనది మరియు శాశ్వతమైనది'' అని నొక్కిచెబుతూ ఔఅఅ క్యాడెట్‌గా తన రోజులను ప్రేమగా గుర్తు చేసుకున్నారు.

2047 నాటికి మన భారత్‌ను నిజమైన అభివృద్ధి చెందిన దేశంగా ఒ ప్రపంచ నాయకుడిగా మార్చేందుకు ఉత్సాహం, పరాక్రమం మరియు అంకితభావంతో పని చేయాలని క్యాడెట్‌లను ఉద్బోధించారు. "క్రమశిక్షణ మరియు దేశభక్తి లక్షణాలు సజీవంగా ఉండాలి. మీ హృదయాలు, ఇది మా మాతృభూమికి మనం చెల్లించగల గొప్ప నివాళి, "అని ఆయన వారికి చెప్పారు.గత సంవత్సరం ఎన్‌సిసి క్యాడెట్‌లకు తాను అందించిన ఒక సలహాను గుర్తుచేసుకుంటూ, స్వచ్ఛ భారత్ అభియాన్, డిజిటల్ లావాదేవీలు, బేటీ బచావో బేటీ పడావో మరియు పర్యావరణ సహకారంలో వారి ప్రభావవంతమైన ప్రమేయాన్ని గమనించినందుకు శ్రీ ధంఖర్ సంతోషించారు. "ఎన్‌సిసి జాతీయ అవగాహన ప్రచారాలకు రాయబారులుగా మీ సేంద్రీయ వృద్ధిని నిర్ధారిస్తుంది, సాంస్కృతిక, మతపరమైన మరియు భౌగోళిక మార్గాల్లో ఏకీకరణను ప్రోత్సహిస్తుంది" అని ఆయన గమనించారు.

ఎన్‌సిసిలో పెరిగిన మహిళా భాగస్వామ్యాన్ని ప్రశంసిస్తూ, ఈ రిపబ్లిక్ డే నాడు మహిళా క్యాడెట్లు రెండు ప్రత్యేక బృందాలతో కర్తవ్య బాటలో సగర్వంగా పయనిస్తారని శ్రీ ధంఖర్ పేర్కొన్నారు. "ఎన్‌సిసిలో మహిళా అనుకూల మార్పు చాలా ప్రభావవంతంగా జరుగుతోంది,'' అన్నారాయన.

NCC క్యాంపు ప్రారంభోత్సవం సందర్భంగా, శ్రీ ధంఖర్ వివిధ NCC డైరెక్టరేట్ల పట్టికలను ప్రదర్శించిన ఫ్లాగ్ ఏరియాను కూడా సందర్శించారు. ఆ తర్వాత అతను ఔఅఅ యొక్క 'హాల్ ఆఫ్ ఫేమ్'ని సందర్శించాడు మరియు క్యాడెట్లచే మంత్రముగ్ధులను చేసే సాంస్కృతిక ప్రదర్శనను చూశాడు.

డిజి ఎన్‌సిసి లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్, ట్రై-సర్వీసెస్‌కు చెందిన సీనియర్ అధికారులు, దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌సిసి క్యాడెట్లు ఈ వేడుకలో పాల్గొన్నారు.

# ఆది శ్రీనివాస్ చేతులమీదుగా 'పల్లె రుచులు' రెస్టారెంట్ ప్రారంభం



రాజన్న సిరిసిల్ల, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లో నుతంగా ఏర్పాటు చేసిన 'పల్లె రుచులు' రెస్టారెంట్ ను శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ 'పల్లె రుచులు' రెస్టారెంట్ ను ప్రారంభించడం అభినందనీయమని, రెస్టారెంట్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన బోజనాన్ని అందించాలని సూచించారు.

# మాజీ రాష్ట్రపతితో సీహెచ్ విద్యాసాగర్ రావు భేటీ



రాజన్న సిరిసిల్ల, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి): మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు శనివారం రాజ్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామ్‌నాథ్ కోవింద్‌కు విద్యాసాగర్ రావు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఇరువురు కొద్ది సేపు వివిధ అంశాలపై చర్చించుకున్నారు. కాగా, జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం కోసం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్రం ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వచ్చిన రామ్‌నాథ్ కోవింద్‌ను చెన్నమనేని విద్యాసాగర్ రావు సమావేశమవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. అనంతరం వీరు రాజ్‌భవన్‌లో కలిసి విందు ఆరగించారు.

# కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



రాజన్న సిరిసిల్ల, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కళాకారులను విస్మరించకుండా కళాకారులను ఆదుకోవాలని టీజేసి కళాకారుల కమిటీ చైర్మన్‌యెల్ల పోశెట్టి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం వేములవాడ పట్టణంలో తెలంగాణ కళాకారుల ఐక్య కార్యాచరణ సమితి వేములవాడ నియోజకవర్గం కళాకారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయనమాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రాష్ట్ర ఉద్యమకారుల పోరాటాన్ని గుర్తించి మేనిఫెస్టోలో ప్రకటించడం చాలా సంతోషం. అలాగే ఈ ఉద్యమంలో పాల్గొని, కేసులు ఉన్న వారికే కాకుండా రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న కళాకారులను కూడ గుర్తించి ఉద్యమా పోరాట స్వాతంత్ర సమరయోధులుగా అర్హులైన వారిని గుర్తించి ఉద్యమ పోరాట కళాకారులందరినీ జిల్లా కేంద్రం నందు 250 చదరపుగజాల స్థలం ఇవ్వాలని, కళాకారులకు నెలకు గౌరవ వేతనం 20వేల రూపాయలు ఇచ్చి కళాకారుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ,బొడ్డు రాములు, సావనపల్లి శ్రీనివాస్ ,వారాల దేవయ్య ,కనపర్తి హనుమాడ్లు,వనం రాజయ్య మారం ప్రవీణ్, గంగా శ్రీకాంత్, దొంగరి లక్ష్మిరాజం, బుర్రి శంకరయ్య, మాన్వాడ లక్ష్మీనారాయణ వెంపటి సంతోష్ కుమార్, బిల్లా వెంకట నరసయ్య, మొగిలోజి లక్ష్మిరాజ్యం తదితర కళాకారులు పాల్గొన్నారు..




# క్రీడలతో పోటీతత్వం, స్నేహభావం పెరుగుదల : ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల : విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల పోటీతత్వం, స్నేహాభావం పెరుగుతుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. కేరళ రాష్ట్రంలో జాతీయస్థాయిలో నిర్వహించిన సాఫ్ట్ బేస్బాల్ పోటీల్లో విద్యార్థులు దీక్షిత్, హిమెక్షన్, కౌశిక్, పి. హర్షిత్ శివమణి, హిమేష్ చరణ్, టి హర్షిత్, కాంస్య పతాకాలు సాధించగా, కృష్ణ చైతన్య అనే విద్యార్థి రజత పతాకాన్ని సాధించారు.

ఈ సందర్భంగా శనివారం క్వార్టర్స్ లో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. పతకాలను సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని అన్నారు. ఏకాగ్రత, పట్టుదల ఉంటే ఏ రంగం లోనైనా రాణించవచ్చని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సచిన్, డీన్ శ్రీనివాస్, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పనితక్కువ.. ప్రచారం ఎక్కువ: బాల్క సుమన్

హైదరాబాద్, జనవరి 6: పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే బాల్క సుమన్ స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా పెద్దపల్లి నియోజకవర్గ నాయకులతో ఇవాళ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం బాల్క సుమన్ మాట్లాడుతూ.. నేతలు సూచనలు, అభిప్రాయాలను పెద్దలు స్వీకరించారని తెలిపారు. సమష్టి కృషితో పనిచేయాలని నిర్ణయించారని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో గెలుపుపై పార్టీ పెద్దలు దిశానిర్దేశం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ పని తక్కువ.. ప్రచారం ఎక్కువ అన్నట్టు ఉందని బాల్క సుమన్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతలు బీఆర్ఎస్ కార్యకర్తలపై ఎందుకు దాడులకు దిగుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. రైతుబంధు కింద విడుదల చేసిన డబ్బులు ఏమైపోయాయని ప్రశ్నించారు. గత ప్రభుత్వం పథకాలకు ఇచ్చిన ప్రొసీడింగ్ నిలిపివేడయం సరికాదని అన్నారు. ప్రజాపాలన పేరుతో హామీల అమలును వాయిదా వేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అసెంబ్లీ ముందు కంచెలు ఎందుకు కూలగొట్టలేదని ప్రశ్నించారు.

# వన్యప్రాణుల వేటకు పాల్పడేవారిపై కఠినచర్యలు

## -కరెంట్ తీగల అమర్చడంతో ప్రజల ప్రాణాలకు ముప్పు
## -వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి

రాజన్న సిరిసిల్ల, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ, జనవరి 6: వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి శనివారం వన్య ప్రాణుల వేటకు పాల్పడేవారిపై పలు హెచ్చరిఖలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వన్యప్రాణులను వేట కోసంకరెంట్ తీగలు అమర్చడం లాంటి చర్యలకు పాల్పడవద్దని, వ్యవసాయ పొలాల వద్ద వేటగాళ్లు కరెంటు తీగలు అమర్చి వన్యప్రాణుల మృతికి కారకులు అవుతున్నారని, ఇట్టి చర్యల వలన అమాయక ప్రజలు కూడా ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామం, రుద్రంగి మండల మానాల గ్రామ శివారుణ కొంతమంది వన్యప్రాణుల కోసం ఏర్పర్చిన కరెంటు తీగలకు ఇద్దరు వ్యక్తులు మరణించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి వీరిపై కేసు నమోదు చేసి పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపించడం జరిగిందన్నారు. కాబట్టి ప్రజలు కానీ, వేటగాళ్లు గాని వన్యప్రాణులు కొరకు కరెంట్ తీగలు ఏర్పాటు చేయడం, వన్యప్రాణుల ప్రాణాలు తీయడం చేయవద్దని, ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వ్యాపార, వాణిజ్య సంస్థల్లో ప్రజా భద్రత చర్యలు తప్పనిసరి

## -జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్ఫోర్స్మెంట్ యాక్ట్ లో భాగంగా 100 మంది కన్నా ఎక్కువ జనసంచారం ఉండే సంస్థల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి అని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.

సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్ఫోర్సెంనెట్ యాక్ట్ లో భాగంగా రోజు వారిలో 100 మంది కన్నా ఎక్కువ జనసంచారం ఉండే వ్యాపార, వాణిజ్య సంస్థల్లో (కమర్షియల్ భవనాలు,షాపింగ్ మాల్స్,ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్, మొదలగు సీసీ కెమెరాలు తప్పని సారిగా ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ శనివారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల పరిశోధనలో,అనుకోని సంఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాలు కీలకంగా వ్యవహరిస్తాయి అని,సిరిసిల్ల వేములవాడ పట్టణాల్లో రోజు వారిలో భాగంగా 100 మంది కన్నా ఎక్కువ జనసంచారం ఉండే వ్యాపార, వాణిజ్య సంస్థల్లో ప్రజా భద్రత చర్యలు తప్పనిసరిగా పాటించాలని, తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎంఫైర్స్మెంట్ యాక్ట్ లో భాగంగా ఎంట్రీ, ఎగ్జిట్, పార్కింగ్ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఈ నెల జనవరి 27 తేదీ లోపు లోపు ఏర్పాటు చేయలని, 27 తేదీ తరువాత వాటి పరిధిలో ఉన్న ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి తనిఖీ చేసిన సమయంలో సీసీ కెమెరాల లేకున్నా, పని చేయకున్న సంబంధిత యజమాని పై తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎంఫైర్స్మెంట్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకువడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

# జనవరి 8 నుండి జెమిని టీవీ లో మనకు "కొత్తగా రెక్కలొచ్చెనా" సరికొత్త సీరియల్




హైదరాబాద్ జనవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలుగు ప్రేక్షకుల వినోదానికి కేరాఫ్ అడ్రస్గా నిలిచిన జెమినీ టీవీ ఎన్నో కార్యక్రమాలను , మరిన్నో సీరియల్స్ ను మనకు అంది స్తుంది. తాజాగా ఇప్పుడు మనకు "కొత్తగా రెక్కలొచ్చెనా ".. అనే సరికొత్త సీరియల్ ను జనవరి 8 నుండి ప్రసారం చేయబోతోంది. అందమైన పల్లెటూరి రైతుబిడ్డ కావేరి! తను ప్రేమించిన బావ నమ్మక ద్రోహం వల్ల.. ఒక వైపు తన తల్లి బందీగా మారినా , మరో వైపు తోడబుట్టిన చెల్లెలి భవిష్యత్తు ప్రశగా మరీనా.. ఈ పరిగెత్తే ప్రపంచంలో తనవాళ్ళ కోసం ఓ రైతుగా, ఆత్మస్థైర్యాన్ని కోల్పో కుండా ఎలా నిలబడిందో తెలిపే కావేరి కథే.. "కొత్తగా రెక్కలొచ్చెనా ".. ఈ నెల 8 నుండి ప్రారంభం, సోమవారం నుండి శనివారం వరకు సా.6 గంలకు. పల్లెను వదిలి తనవాళ్ల కోసం పట్నం బయలుదేరిన కావేరి, రైతుగా.. తాను కోల్పోయిన వన్నీ తిరిగి ఎలా దక్కించుకుందనే.. కథాంశంతో నిర్మితమైన "కొత్తగా రెక్కలొచ్చెనా ". సీరియల్లో సినీనటి ఆమనీ, బుల్లితెర స్టార్ ప్రభాకర్ , సెల్వరాజ్ , నిత్యా, అజయ్ ,కావ్య, తదితర నటీనటులు నటించారు. ఈ నెల 8 వ తేదీ సోమవారం సా 6 గం.లకు జెమిని టివి ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ "కొత్తగా రెక్కలొచ్చెనా ".. సీరియల్ ప్రేక్షకుల ఆధారా భిమానాలను పొందడంలో ఎలాంటి సందేహం లేదని జెమినీ టీవీ యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసారు.

# భారత్‌తో టీ20 సిరీస్.. ఆఫ్ఘాన్ జట్టు ఇదే !



న్యూఢిల్లీ, జనవరి 6: భారత్‌తో టీ20 సిరీస్ ఆడేందుకు ఆఫ్ఘానిస్తాన్ జట్టు తొలి సారి భారత పర్యనటకు రానుంది.

కాగా, జనవరి 11న ప్రారంభం కానున్న ఈ మూడు మ్యాచ్‌ల టీ20ఐ సిరీస్ కోసం ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు సెలక్షన్ కమిటీ ఇవ్వాల (శనివారం) 19 మందితో కూడిన జట్టును ప్రకటించింది.

కాగా, షార్జాలో జంఇతో జరిగిన సిరీస్‌లో ఆఫ్ఘనిస్తాన్‌ను 2-1తో విజయం సాధించిన ఇబ్రహీం జద్రాన్.. భారత్ తో జరగనున్న మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్ కు నాయకత్వం వహించనున్నాడు.

ఇబ్రహీం జద్రాన్ (సి), రహ్మానుల్లా గుర్బాజ్ (డబ్ల్యుకె), ఇక్రమ్ అలీఖిల్ (డబ్ల్యుకె), హజ్రతుల్లా జజాయ్, రహ్మత్ షా, నజీబుల్లా జద్రాన్, మహ్మద్ నబీ, కరీం జనత్, అజ్మతుల్లా ఒమర్జాయ్, షరాఫుద్దీన్ అష్రఫ్, ముజీబ్ ఉర్ రహ్మాన్, ఫజల్, ఫజల్, ఫజల్ ఉల్ హక్, నూర్ అహ్మద్, మహ్మద్ సలీమ్, కైస్ అహ్మద్, గుల్బాదిన్ నాయబ్ మరియు రషీద్ ఖాన్.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి): రుద్రంగి మండల కేంద్రానికి చెందిన గడ్డం రాజవ్వ,"సుమంత్ కాంతవ్వ" ఇటీవల మరణించగా,వారి కుటుంబ సభ్యులను బిఆర్ ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకి, ఏనుగు మనోహర్ రెడ్డి ప్రగాడ సానుభూతి తెలిపారు ఆయన వెంట ఎంపీపీ గంగం స్వరూప- మహేష్ రెడ్డి ,జెడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ అనసీదం, కొడిగంటి శ్యామ్,మహేష్ తదితరులు ఉన్నారు×.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి): తంగళ్ళపల్లి మండల కేంద్రంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్నా రు..ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు..స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.! స్వామివారి కృప కటాక్షాలు ప్రజలం దరిపై ఉండాలని ప్రజలు ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో ఉండాలని వేడుకున్నారు..!!

# ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుంది: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

## -27 వార్డు ప్రజా పాలన కార్యక్రమన్నీ ప్రారంభించిన ప్రభుత్వ విప్



రాజన్న సిరిసిల్ల, జనవరి 6: (నేటినిజం ప్రతినిధి): శనివారం వేములవాడ పట్టణంలో27 వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమంను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. గెలిపించిన ప్రజలకి రుణపడి ఉంటానని. తమ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు, మహిళా సాధికారితకు ఆరు గ్యారంటీ లు దోహదం చేస్తాయని చెప్పారు. అర్హత గల ప్రతి కుటుంబం అభయహస్తం గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ అన్వేష్, కౌన్సిలర్ బింగి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.